# అయేషా మసీదులో ఇఫ్తార్ విందు లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** ముస్లిం మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 43వ డివిజన్ మల్లికార్జుననగర్‌లోని అయేషా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, ముస్లిం పెద్దలు ఛాన్ బాషా, కంటిపూడి శ్రీనివాస్, ఆయేషా మసీదు కమిటీ సభ్యులు తదితరులతో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింల ప్రార్ధనల్లో పాల్గొని అల్ సమి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లాతో కలిసి ఇఫ్తార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ,ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరతత్వం వైపు నడిపిస్తాయన్నారు. రంజాన్ బోధించే సత్యం ఏమిటంటే అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని సూచిస్తోందన్నారు. ఈ రంజాన్ రాష్ట్రంలో శాంతి, సమృద్ధి, ఐక్యతను తీసుకువస్తుందని నమ్ముతున్నామన్నారు .ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాననని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. 2014 – 2019 మధ్యలో నగరంలోని మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి వివిధ పరిపాలన అనుమతులు జీవోల తీసుకురాగా , తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా నాయకులు వాటిని విస్మరించారని విమర్శించారు. నగరంలోని మసీదులు, షాధి ఖానాలకు, ముస్లిం బరియల్ మైదానాలకు కమిటీలు నియమించినట్టు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలుగా ముస్లిం మైనారిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 14వ వార్డు టీడీపీ కమిటీ సభ్యుడు షేక్ మీరా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం.

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 22.**తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,14వ వార్డు టీడీపీ కమిటీ సభ్యుడు అయినటువంటి షేక్ మీరా ఆదివారం ఉదయం హఠాత్తుగా దూరం అవ్వడం చాలా బాధాకరం మని అన్నారు. షేక్ మీరా టీడీపీ కార్యకర్తగా, నాయకులుగా ఎంతో సేవలు మరవలేవాని మంచి మనిషి దూర అవడంతో బాధాకరం అనిఆయనకు కడసారి వీడ్కోలు పలికి.. వారి పాడెను భుజాన ఎత్తుకుని మోసి నివాళు లు అర్పించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ,ముస్లిం నాయకులు పాల్గొన్నారు.




# అనూరియా కేసులపై అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

**కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ దర్యాప్తు**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 22:** జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పట్టణంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) కేసుల క్లస్టర్‌పై ఆదివారం జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కే. వెంకటేశ్వరరావు తెలియజేసిన వివరాలు ప్రకారం, ఆదివారం స్థానిక కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ నుండి లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వరనగర్ స్వరూప్‌నగర్ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు అనూరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం అందిందన్నారు . వెంటనే జిల్లా సర్వైలెన్స్ అధికారికి సమాచారం అందించి అత్యవసరంగా విచారణ ప్రారంభించామన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా సర్వైలెన్స్ అధికారి, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ , ఎపిడెమిక్ సెల్ బృందం కిమ్స్ ఆసుపత్రిని సందర్శించి బాధితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వైద్యుల ప్రాథమిక నివేదికలు, కుటుంబ సభ్యుల వివరాలు , కేసు చరిత్ర ఆధారంగా ఆకస్మిక మూత్రపిండ వైఫల్యం గా అనుమానం వ్యక్తమవుతోందన్నారు. ఫీల్డ్ స్థాయి విచారణలో బాధితులందరూ ఒకే స్థానిక పాల విక్రేత వద్ద నుంచి పాలు కొనుగోలు చేసి వినియోగించినట్లు గుర్తించేయ మన్నారు. సర్వైలెన్స్ తనిఖీలో మరో నాలుగు కేసులు ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో గుర్తించబడడంతో మొత్తం కేసుల సంఖ్య ఎనిమిదికి చేరిందన్నారు. బాధితులందరూ 60 సంవత్సరాల పైబడినవారు కాగా, చౌడేశ్వరనగర్ స్వరూప్‌నగర్ ప్రాంతాల్లోని నాలుగు కుటుంబాలకు చెందినవారిగా గుర్తించారు. ప్రస్తుతం అంటువ్యాధి లక్షణాలు ఉన్నట్టు ఆధారాలు లేవన్నారు. కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి సమగ్ర ఎపిడెమి యాలజికల్ క్లినికల్ విచారణ చేపట్టారు. ఆహారం, నీరు, మల నమూనాలు సేకరించి ప్రయోగశాల పరీక్షలకు ఫోరెన్సిక్ పరిశీలనకు పంపిం చామన్నారు. అనుమానిత పాల వనరును ఫుడ్ సేఫ్టీ అధికారి పరిశీలించి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలకు సురక్షితమైన ఆహారం, పాలు వినియోగంపై అవగాహన కల్పించడం , ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. ప్రస్తుతం ప్రజారోగ్య పరంగా పరిస్థితి స్థిరంగా ఉంది. ప్రయోగశాల నివేదికలు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ తుది నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోబడతాయనీజిల్లా వైద్య ఆరోగ్య అధికారి తెలియ చేశారు.



దివ్య పుష్పాలంకారంలో అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఎక్సైజ్ నిఘా, తనిఖీల్లేని మద్యం దుకాణాలు






- **కనిపించని పర్మిట్ రూములు,**
- **రోడ్లమీదనే మద్యం బాబులు**
- **ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్**
- **మామూళ్ల మత్తు లో ఎక్సైజ్ శాఖ**
- **శాంతిభద్రతల సమస్యలతో మహిళలు, పిల్లలు ఆందోళన**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:**నగరంలోని మద్యం దుకాణాలు సిండికేట్ గా మారి ప్రభుత్వ నిబంధనలు భేఖాతార్ చేస్తున్నాయని ఆరోపణలు హల్చల్ చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మద్యం దుకాణం వద్ద అనుబంధంగా మద్యం సేవించడానికి పర్మిట్ రూమ్ తో పాటు త్రాగునీరు, వాష్ రూం వంటి ఇతర మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలను అమలు చేయడంలో మద్యం సిండికేట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాగితాల్లో కనిపించే విధంగా ప్రభుత్వానికి పర్మిట్ రూము లైసెన్స్ నిమిత్తం రూ. 7 లక్షల రూపాయలు ఫీజు ను కొన్ని మద్యం దుకాణాలు చెల్లించాయని తెలుస్తుంది. నగరంలో సుమారు 40 మద్యం దుకాణాలు ఉండగా , ఒకటి రెండు షాపులు సిండికేట్ లో లేవని తెలుస్తోంది. పర్మిట్ రూములు లేకపోవడం వల్ల మద్యం బాబులు ఫుట్ పాత్ లు, గోదావరి గట్టు వద్ద, రోడ్ల మీద, కిల్లీ కొట్ల వద్ద బహిరంగంగా మద్యం సేవించడం జరుగుతుంది. ముఖ్యంగా ఉదయం సాయంత్రం వేళల్లో మహిళలు విద్యార్థునీల పట్ల మందుబాబులు వేధింపులకు దిగడం తో శాంతి భద్రతల సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం అవుతుంది. కొన్ని కుమారి టాకీస్, శ్యామల సెంటరు, విఎల్ పురం, మోరంపూడి దుకాణాల్లో మద్యం సేవించడానికి నామమాత్రంగా సిట్టింగ్ రూమ్‌లు" ఉన్నప్పటికి అవన్నీ అపరిశుభ్రంగా , మలమూత్ర దుర్గంధం తో అసౌకర్యం కలిగించే విధంగా ఉన్నాయని, వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి, నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారే తప్ప, అక్రమాలకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారని స్థానికులు, మందుబాబులు ఆరోపిస్తున్నారు. వందల రూపాయల ఖర్చు పెట్టి మద్యం సేవిస్తున్నామని కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేవని కుమారి టాకీస్ వద్ద ఉన్న దుకాణం యజమానులపై విమర్శలు గుప్పించారు. ఎక్సైజ్ , పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ మామూళ్ల మత్తు లో వారు పట్టించుకోవడంలేదని, మద్యం సిండికేట్ల మామూళ్ళ మత్తులో పడి ఉదాశీనంగా ఉంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత్యంతరం లేక ఎక్సైజ్, పోలీస్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసినప్పటికీ మద్యం అక్రమార్కుల పై ఏ విధమైన కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. రూరల్ పరిధిలో కొలమూరు, ధవళేశ్వరం, గాడాల, కాతేరు, పిడెం గొయ్యి, నగరంలో కుమారి టాకీస్, అశోక్ థియేటర్, దానావాయి పేట, ఏవి అప్పారావు రోడ్డు శివారు వెంకటేశ్వర వైన్స్, దేవి చౌక్ పేపర్ మిల్ రోడ్డు , వంటి కొన్ని ప్రాంతాల్లో పర్మిట్ రూములేవని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వనికి పర్మిట్ రూముల లైసెన్స్ ఫీజు చెల్లించామని కాగితాలలో ఉండడంతో ఎక్సైజ్ అధికారులు తమ జోలికి రారని, మద్యం దుకాణాల యజమానులు బహిరంగంగానే ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. ఫీజులు చెల్లించడంతో మద్యం దుకాణాల సిండికేట్ పర్మిట్ రూములు ఏర్పాటు చేయకపోవడం వల్ల రోడ్లమీద, వీధుల్లోనూ, సమీపంలోని ఇళ్ల అరుగుల మీద మద్యం సేవిస్తున్నారని స్థానికులు, మహిళలు వాపోతున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో మద్యం అడ్డాలు గా పేరుబడిన సమాచారం సంబంధించి ఎక్సైజ్, పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ నిత్యం మద్యం బాబులు అక్కడే మద్యం తాగుతున్నారని పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి అంటే విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి అక్రమ సిట్టింగ్ లు నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ, అధికారులు వీటిపై కన్నెత్తి చూడటం లేదని స్థానిక మహిళలు ఆరోపణలు చేస్తున్నారు. మద్యం షాపుల నిర్వాహకుల మద్యం విక్రయాలు, మద్యం బాబుల ఆగడాలతో, ట్రాఫిక్ రద్దీతో పాటు స్థానికంగా శాంతిభద్రతల సమస్యలకు దారితీస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ అడ్డాల వద్ద రచ్చ రచ్చ, ఘర్షణలు సర్వసాధారణం అయిపోయాయని, మహిళలు, పిల్లలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.ఎక్సైజ్ అధికారులు , జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలకు వస్తున్నప్పటికీ, ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని ప్రజలు, మహిళలు విమర్శిస్తున్నారు. తనిఖీలకు అధికారులు వస్తున్నారని ముందస్తుగా సమాచారం సొంత శాఖ నుంచి లీకులు రావడంతో అక్రమ మద్యం వ్యాపారులు షాపులను మూసివేయడం, లేదా సిట్టింగ్ రూమ్‌లను ఖాళీ చేయూస్తున్నారని, అధికారుల తనిఖీ పూర్తయిన వెంటనే మళ్లీ యథావిధిగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. తనికీల్లో కొన్నిసార్లు అక్రమలు పట్టుపడిప్పటికీ, భారీ జరిమానాలు విధించడం, లైసెన్స్‌లను రద్దు చేయడం వంటి కఠిన చర్యలు చేపట్టిన దాఖలాలు లేకపోవడంతో మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, మహిళలు వాపోతున్నారు. గత్యంతరం లేక ఒత్తుడులు పెరిగినప్పుడు వచ్చినప్పుడు తక్కువ మొత్తంలో జరిమానాలు విధించి సరిపెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నేతలు , ప్రజా ప్రతినిధుల అండ, ఎక్సైజ్, పోలీస్ అధికారుల లోపాయి కారి మద్దతు ఉండడంతో అక్రమార్కులు ఇస్టా రాజ్యాంగా వ్యవహరిస్తున్నారని , వారి వ్యాపారాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని విమర్శిస్తున్నారు.

**మామూళ్ల మత్తు లో ఎక్సైజ్ అధికారులు...**

ఈ మొక్కుబడిగా వ్యవహారం వెనుక ఎక్సైజ్ అధికారుల మామూళ్ల మత్తు లో పడుతున్నారని అనుమానాలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. మద్యం అక్రమ వ్యాపారులు అధికారులకు ముడుపులు భారీగా ముట్ట చెప్పడం వల్లనే వారిపై చర్యలు తీసుకోవడంలో శాఖ అధికారులు వెనుకంజ వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మద్యం అక్రమాలపై ప్రజలు ఫిర్యాదులు చేసినా, వాటిని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా గండి పడుతోందని తెలుస్తుంది.

ఈ నేపథ్యంలో నగర , రూరల్ ప్రజలు ఈ అక్రమాలపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు. సిట్టింగ్ రూమ్‌లు లేకుండా నడుపుతున్న మద్యం సిండికేట్ వ్యాపారులపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, మద్యం దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేయాలని కోరుతున్నారు. మొక్కుబడిగా కాకుండా, క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ వ్యాపారాలను అడ్డుకోవాలని ప్రజలు, మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా ఈ అక్రమాల వెనుక ఉన్న అధికారుల ముడుపుల పైన సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు , ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పోలవరం నిర్వాసితుల భూమి సమస్యలపై ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** రంపచోడవరంలో రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి ను పూర్వం ఎల్లవరం, ప్రస్తుతం రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలవరం మండలం చీడూరు గ్రామస్థులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, దేవీపట్నం మండలం ఏనుగులగూడెం గ్రామస్థులు కలిసి తమ భూమి సమస్యలను వివరించారు. ప్రాజెక్టు గేట్లు మూయడంతో అనేక వ్యవసాయ భూములు నీటిలో మునిగిపోతున్నాయని, మునిగిన భూములకు తగిన నష్టపరిహారం ఇప్పించాలని నిర్వాసితులు కోరారు. అలాగే ప్రాజెక్టు నీటితో మునిగిపోయిన తాటిచెట్లు, మామిడిచెట్లు తదితర వృక్షాలకు కూడా పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏనుగులగూడెం రైతుల డి-ఫారం పట్టాల భూములు ముంపుకు గురవుతున్నందున, పోడు పట్టాలకు సరైన పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పోలవరం మండలం కొరుటూరు గ్రామస్థులు, సర్పంచ్ మాట్లాడుతూ "భూమికి భూమి" పద్ధతిలో ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో తాము పంటలు వేస్తుండగా, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాలకు చెందిన కొందరు వచ్చి పంటలు కోసుకుపోయారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని, నష్టపరిహారం చెల్లించడంతో పాటు తమకు కేటాయించిన భూములను సాగు చేసుకునేలా రక్షణ కల్పించాలని నిర్వాసితులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కోరారు. వారి వినతిని స్వీకరించిన చైర్మన్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# యువతి మిస్సింగ్ కేసు నమోదు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** స్థానిక కొత్తపేటలో బంధువుల ఇంటికి వచ్చిన అమ్మాయి కొప్పల అక్షయ, కనిపించడం లేదని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. తన కుటుంబ సభ్యులతో హైదరాబాదులో ఉంటూ, స్థానిక కొత్తపేటలో నివాసం ఉండే తన మేనమామ ఇంటికి ది 17 వ తేదీన ఆ యువతి వచ్చిదన్నారు .ఈమె ఈనెల 21 వ తేదీన మధ్యాహ్నం 3:45 గంటల సమయంలో కొత్తపేట నుండి వెళ్లిపోయినదన్నారు. కూతురు కనిపించడం లేదని ఆమె తల్లీ కొప్పల ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు పై వన్ టౌన్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారని కానిస్టేబుల్ కె సూర్యనారాయణ తెలిపారు. క్రైమ్ నెంబర్ :31/2026 యు/ఎ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు వన్ టవును పోలీసులను వంటలు సంప్రదించాలన్నారు.

# అమర వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళులు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22**
జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన అమర వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో తొలి దశలోనే ధైర్యసాహసాలతో పోరాడిన మహనీయుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. దేశభక్తి, త్యాగం, ధైర్యం వంటి గొప్ప విలువలకు ఆయన జీవితం ప్రతీకగా నిలిచిందన్నారు. నేటి తరాలు ఆయన జీవిత విశేషాలను తెలుసుకుని, దేశసేవా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్యామలాంబ హైస్కూల్ భవనానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు శంకుస్థాపన

**విద్యార్థులకోసం పాఠశాలలకు మౌలిక వసతులపై దృష్టి పెట్టాం**



**రాజమహేంద్రవరం , పెన్ పవర్ ఫిబ్రవరి 22:** కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో భాగంగా పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రౌండ్ టేబుల్ ఆర్గనైజేషన్ , దాతల సహకారంతో 11వ డివిజన్‌లోని రూ. 40 లక్షలతో నిర్మించనున్న శ్యామలాంబ అప్పర్ ప్రైమరి స్కూలుకు ఉన్నత పాఠశాల భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే వాసు శంఖుస్థాపన చేసారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు శ్యామలాంబ అప్పర్ ప్రైమరీని హైస్కూలు స్థాయికి మార్చుకున్నామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. రూ 20 లక్షలతో కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో పూర్తిచేయ బోతున్నామని తెలిపారు. ఈ స్కూలుకి అప్ గ్రేడ్ కోసం స్థలం గుర్తించామన్నారు. రౌండ్ టేబుల్ ఆర్గనైజేషన్ సభ్యులు డాక్టర్ తరుణ్, డాక్టర్ సందీప్, డాక్టర్ సూర్య, డాక్టర్ వరుణ్ జెట్టి, డాక్టర్ శ్రీనివాస్ రాజ్ తదితరులు రూ. 25 లక్షలు సాయం ప్రకటించారని, మిగిలిన రూ. 15లక్షలు కంటిపూడి రాజేంద్రప్రసాద్ దాతల ద్వారా సమకూరుస్తామని చెప్పారని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, విద్యా శాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజుని కలిసిన తోట




**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తోట రామకృష్ణ ఆదివారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజుని మర్యాదపూర్వకంగా కలిసారు. భీమవరం క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ మోషేన్ రాజుకి శాలువా కప్పి, పుష్ప గుచ్చం అందచేసి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. పార్టీ మరింత బలోపేతమయ్యే దిశగా కృషి చేయాలని రామకృష్ణకు చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు ఇంటి వీర్రాజు, కొవ్వూరు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు కవల నాగేశ్వరావు, పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షులు బట్టు సుబ్బారావు, తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం ఉన్నారు.

# రోజుకు ఐదు వేల అడుగులు వేస్తే ఆరోగ్యం మన వెంట ఉంటుంది




- రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- 5కే రన్ లో పాల్గొన్న ప్రముఖ హాస్య నటుడు భద్రం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** నగర ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చటంతో పాటు ఆనందాన్ని పంచే లక్ష్యంగా హ్యాపీ సండే కార్యక్రమాన్ని పునరుద్ధరించినట్లు రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
ఆదివారం ఏకేసీ కాలేజీ రోడ్డులోని నందమూరి తారక రామారావు పార్క్ (హ్యాపీ స్ట్రీట్ పార్క్) వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా యువకులు పాటలు, నృత్యాలతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ .
నగర, పుర ప్రజల ఆనందం, జీవన ప్రమాణాలు పెంపొందించడం, ఒత్తిడి లేని జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. వేగంగా మారుతున్న జీవన విధానంలో ప్రజల్లో సామాజిక అనుబంధం, సానుకూల దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నెల 2వ, 4వ ఆదివారాల్లో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు హ్యాపీ సండే కార్యక్రమాలను నిర్వహిస్థామన్నారు. 5కే వాక్, జుంబా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యోగా, ధ్యానం, నడక, సైక్లింగ్, క్రీడా పోటీలు, సంగీతం, సాహిత్య, కళా ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను కూడా చేపట్టనున్నట్లు వివరించారు. ప్రతి రోజూ కనీసం ఐదు వేల అడుగులు నడక అలవాటు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుందన్నారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ రోజువారీ జీవనశైలిలో నడకను భాగం చేసుకోవడం అత్యంత అవసరం.
అన్ని వయసుల వారు ఈ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించవచ్చని, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయటానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. హ్యాపీ సండే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యమయ్యేలా జిల్లా యంత్రాంగం తరపున సమగ్ర ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్య నటుడు భద్రం, ఆర్ఎంసీ ఉద్యోగులు, పలువురు సినిమా ప్రముఖులు, వాకర్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, చిన్నారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

- 250 మందికి ఉచిత వైద్య సేవలు





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 250 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు. శిబిరంలో డా. పోతుల రామారావు, డా. శ్రీనివాస్ రాయుడు, డా. దాసరి ఉమామహేశ్, డా. ఐ. రాజేశ్ ఖన్నా తదితర వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మొత్తం 90 మందికి రక్తపరీక్షలు, 12 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఇద్దరికి ఈసీజీలు, ఆరుగురికి ఎక్స్‌రేలు, 17 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామీజీ వివరించారు. ఈ సందర్భంగా రోగులు మరియు సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు. శిబిరంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమొను శ్రీనివాస్, ఉదయభాస్కరరావు, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం




**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** గంగవరం లో ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రధానంగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదనే సూచనలు, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై వెంకయ్య సూచించారు. తనిఖీల సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు చలాన్లు కూడా విధించారు. ప్రజల భద్రతే ముఖ్యమని, రహదారి ప్రమాదాలను నివారించడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు.

## ఏజెన్సీలో రహదారులకు మహర్దశ-జగదీశ్వరి



**పోలవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 22:** కూటం ప్రభుత్వం గిరిజన గ్రామాల్లోని రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి కొనియాడారు. పోలవరం మండలం ఇటుకలకోట నుండి రేపల్లెవాడ జంక్షన్ వరకు 7.1 కిలోమీటర్లు రహదారి నిర్మాణానికి 3.3 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రహదారి పనులను శాప్ డైరెక్టర్ జగదీశ్వరి, ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ తో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ఈ రహదారి పూర్తిగా అద్వాన్నంగా ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగించేదన్నారు. గోతుల మయమై శిధిలావస్థకు చేరిన ఈ రహదారి గురించి ఏలూరు పార్లమెంటరీ సభ్యులు పుట్టా మహేష్, స్థానిక శాసనసభ్యులు సిర్రి బాలరాజు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు స్పందించి నిధులు మంజూరు చేయించడంతో సమస్యకు పరిష్కారం మార్గం లభించిందన్నారు. దొండపూడి గోదావరి ఏటి గట్టు కు వెళ్ళే ప్రధాన రహదారిలో రేపల్లెవాడ జంక్షన్ నుండి ఈ రహదారి విడిపోయి పోలవరం మండలంలోని గిరిజన గ్రామాలకు వెళ్తుందన్నారు. దశాబ్దాల క్రిందట నిర్మించిన ఈ రహదారి పూర్తిగా గోతులమయం అయిందన్నారు. కూటమి ప్రభుత్వం చలువతో ఈ రహదారికి మోక్షం లభించినట్లు అయిందని జగదీశ్వరి తెలిపారు. టిడిపి హయాంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయి అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. గతంలో అన్న ఎన్టీఆర్ హయంలో మారుమూల గిరిజన గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకుని కనీస సౌకర్యాలైన త్రాగునీరు, రహదారులు, ప్రభుత్వ గృహాలు వంటివి నిర్మించారన్నారు. అనంతరం ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయంలో ఈ రహదారులను పునర్నిర్మిస్తున్నామని జగదీశ్వరి అన్నారు. ఇదిలా ఉంటే ఈ రహదారి నిర్మాణంతో ఎన్నో గ్రామాల ప్రజల సమస్యలు తీరినట్లయింది. వీరంతా ఆరోగ్యం, విద్య, నిత్యావసర వస్తువులు వంటి వాటి కోసం ఈ రహదారిపైనే ప్రయాణం చేయవలసి ఉంది. ఈ కార్యక్రమంలో పోలవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చిన్ని, మండల టిడిపి అధ్యక్షులు కొండ, ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు, మండల బిజెపి నాయకులు నాగరాజు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

